# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అనకాపల్లి జిల్లాలో నిర్వహించే 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పాల్గొననున్నారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో చేపట్టబోయే తాగునీటి పథకానికి 'అమరజీవి జలధార' పేరును ఖరారు చేసినట్టు ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ వెల్లడించారు.**

3. **ప్రజాసమస్యల పరిష్కారమే సంకల్పంగా ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.**

4. **నిరుపేద, మధ్యతరగతి వర్గాల వైద్య సాయానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసాను కల్పిస్తుందని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు.**

==========================

అనకాపల్లి జిల్లా, తల్లపాలెంలో ఈ రోజు నిర్వహించే 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే ప్రజావేదిక సభకు హాజరై స్థానికులతో ముచ్చటించనున్నారు. అనంతరం పార్టీ కేడర్‌తో, మత్స్యకారులతో సమావేశం, అలాగే మాజీ ప్రధాని అటల్ బిహారి వాజపేయి విగ్రహావిష్కరణ వంటి కార్యక్రమాల్లోనూ ముఖ్యమంత్రి పాల్గొంటారని అధికారులు వెల్లడించారు.

--------------------------

ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న సాయంత్రం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లో వివిధ ప్రాజెక్టుల పురోగతిపై ఇరువురు నేతల మధ్య చర్చ జరిగిందని అధికారులు వెల్లడించారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సుకు వచ్చిన సానుకూల స్పందనను కేంద్ర హోం మంత్రికి ముఖ్యమంత్రి వివరించినట్లు అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై భేటీలో ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు వెల్లడించారు. అనంతరం క్రెడాయ్ నేషనల్ కాన్ క్లేవ్ లో ముఖ్యమంత్రి పాల్గొన్నారని తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి గోదావరి జిల్లాల పరిధిలో చేపట్టబోయే తాగునీటి పథకానికి 'అమరజీవి జలధార' పేరును ఖరారు చేసినట్టు ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు

ఉద్దేశించిన జల్ జీవన్ మిషన్ వాటర్ గ్రిడ్ పథకాన్ని రాష్ట్రంలో అమరజీవి జలధార అని వ్యవహరించనున్నట్టు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి క్యాంపు కార్యాలయంలో ఈ పథకానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన నిన్న విడుదల చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులను ఈరోజు నిడదవోలు నియోజకవర్గం పెరవలి గ్రామంలో ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 ఉమ్మడి జిల్లాల పరిధిలో 5 ప్రాజెక్టులను ఈ పథకంలో భాగంగా చేపడుతున్నారు.

---------------------------

సుపరిపాలనను ఆచరించి చూపడమే మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్ పేయికి మనమిచ్చే ఘన నివాళి అని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాదవ్ చేపట్టిన అటల్, మోదీ సుపరిపాలనా యాత్ర నిన్న విజయనగరం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన సభలో మాజీ ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. దేశ సర్వతోముఖాభివృద్ధి కోసం వాజ్ పేయి కృషి చేశారన్నారు. దేశంలో పెద్ద ఎత్తున రహదారులు అనుసంధానం చేశారని పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

ప్రజాసమస్యల పరిష్కారమే సంకల్పంగా ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. హైదరాబాద్, బేగంపేట ప్రజా భవన్‌లో ప్రజావాణి 2వ వార్షికోత్సవాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా రెండేళ్ల ప్రగతి నివేదికను ఉప ముఖ్యమంత్రి విడుదల చేశారు. ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేసిన అధికారులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 26వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

గ్రామీణ ప్రాంత వేతనదారులకు కల్పిస్తున్న ఏడాదికి 100 రోజుల పని దినాలను 125 రోజులకు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన “వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్)” బిల్లు నిన్న రాజ్య సభ ఆమోదం పొందింది. ఈ బిల్లును లోక్ సభ మొన్న ఆమోదించింది. దీంతో ఉభయ సభల్లో ఈ బిల్లు ఆమోదం పొంది చట్ట రూపం దాల్చింది. ఈ బిల్లుతో సహా మొత్తం 8 బిల్లులు ఈ సమావేశాల్లో ఆమోదం పొందినట్లు అధికారులు వెల్లడించారు.

మరోవైపు.. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. ఉభయ సభలు నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ ఛైర్మన్ సిపి రాధాకృష్ణన్ ప్రకటించారు.

---------------------------

నిరుపేద, మధ్యతరగతి వర్గాల వైద్య సాయానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసాను కల్పిస్తుందని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ఏలూరు జిల్లా, నూజివీడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిన్న అత్యవసర సమయాల్లో ప్రవేటు వైద్యం చేసుకున్న వారికి ఆర్థిక భరోసాగా 30 మందికి 14 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధిలో భాగంగా చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో నిలిపివేసిన ముఖ్యమంత్రి సహాయ నిధిని ముఖ్యమంత్రి పునరుద్ధరించి పెద్ద ఎత్తున సాయం అందిస్తూ ఆదుకుంటున్నామని తెలిపారు.

---------------------------

కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాదులో విద్యుత్ వాహన తయారీదారులు, డీలర్లతో నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటివరకూ లక్షా 59 వేల 304 విద్యుత్ వాహనాలకు 806 కోట్ల రూపాయల రాయితీ ఇచ్చామని తెలిపారు. ప్రభుత్వ విద్యుత్ వాహనాల పాలసీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్ బంక్‌లు, వాహనాల షోరూమ్‌ల దగ్గర ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్యను పెంచాలన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలోని దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి బి. శేఖర్ తెలియజేస్తూ..

వాయిస్.. 27 సెకన్లు

మరోవైపు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతుంది. మన్యం జిల్లాల్లో దట్టమైన పొగమంచు కురుస్తుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు 4 డిగ్రీల నుంచి 8 డిగ్రీలలోపు నమోదవుతున్నాయి.

తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు పొడివాతావరణం నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో ఈ రోజు అక్కడక్కడా కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకూ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

అదిలాబాద్, కొమరం భీమ్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా శీతల గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

---------------------------

దక్షిణాఫ్రికాతో జరిగిన 5 మ్యాచ్ ల టి20ల సిరీస్‌ను భారత్ 3–1 తేడాతో కైవసం చేసుకుంది. దక్షిణాఫ్రికాతో అహ్మదాబాద్‌లో నిన్న జరిగిన 5వ టి20 మ్యాచ్ లో భారత జట్టు 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. అనంతరం దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 8 వికెట్లు కోల్పోయి 201 పరుగులే చేయగల్గింది. ఈ సిరీస్ లో 4వ మ్యాచ్ పొగమంచు కారణంగా రద్దు అయ్యింది.

======================